క్లుప్తంగా

24 నుంచి కళాశాల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పర్చూరు (చినగంజాం): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్దేశించిన కళాశాలల్లో 19 ఏళ్లలోపు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24వ తేదీ నుంచి జరుగుతుందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఈదర చింపారెడ్డి శనివారం తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సింగరాయకొండలో ఈ నెల 24, 25 తేదీల్లో ఉదయం గం.10 నుంచి యోగా, ఫెన్సింగ్, చెస్, బాక్సింగ్, జూడో, కరాటే, మాల్కం, జిమ్నాస్టిక్స్, బీచ్ వాలీబాల్ పోటీల్లో ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కందుకూరులో ఈనెల 26న అథ్లెటిక్స్, 27 హాకీ, హ్యాండ్ బాల్, 28 క్రికెట్ పోటీల్లో ఎంపిక జరుగుతుందన్నారు. ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాలలో ఈ నెల 27 వ తేదీ మోడరన్ పెంటాథ్లాన్, రగ్బీ, 28న సాఫ్ట్‌బాల్, షూటింగ్ బాల్, 29 న బేస్ బాల్, రీజనింగ్ పోటీలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 94406 21579 నంబరును సంప్రదించాలని కోరారు.

విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ చేయూత



చీరాల టౌన్: విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని రోటరీ ప్రతినిధులు తెలిపారు. శనివారం మండలంలోని దేవాంగపురి పంచాయతీలోని హస్తినాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్లబ్ సభ్యులు చీరాల కృష్ణమూర్తి, నక్కల సురేష్‌బాబు రూ.14 వేలు ఆర్థిక సహాయంతో కుట్టించిన స్కూల్ యూనిఫారాలను అందించారు. రోటరీ అందిస్తున్న సేవా పథకాలను వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు బాల వెంకటేశ్వరరావు, సురేష్, కృష్ణమూర్తి, రామకృష్ణ, శ్రీనివాసరావు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యభర్తలకు గాయాలు

కారంచేడు: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో భార్యభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన కారంచేడు ఆంజనేయస్వామి బొమ్మ సమీపంలోని స్వర్ణ రోడ్డులో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఎస్ రాంబాబు, కృష్ణకుమారి దంపతులు కారంచేడులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. చిన్నగా వర్షం కురుస్తుండటంతో గొడుగు వాహనం నడుపుతున్న రాంబాబు కళ్లకు అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో స్వర్ణ వైపు నుంచి వస్తున్న బైక్ పర్చూరు నుంచి చీరాల వైపునకు వెళ్తున్న బస్సును ఢీకొట్టారు. దీంతో వారు ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 సాయంతో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడా దుస్తులు పంపిణీ

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 పూర్వ విద్యార్థి కోలా మోహన్‌రావు 60 విద్యార్థులకు క్రీడా దుస్తులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం శేఖరరావు మాట్లాడుతూ మండల, నియోజకవర్గస్థాయిలో క్రీడాపోటీలు జరుగుతున్న సందర్భంగా పూర్వవిద్యార్థి 30 బాలికలు, 30 మంది బాలురకు క్రీడా దుస్తులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో భవాని దేవి, శివశంకర్, పీడీ కే నాగేశ్వరరావు, టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



చీరాల అర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బాపట్ల జిల్లా హెచ్‌డీఎఫ్‌ఐ సెక్రటరీ కరిముల్లా పేర్కొన్నారు. శనివారం చీరాల రూరల్ మండలం జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో రోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతో పాటు భవిష్యత్తులో ఉపాధిని సైతం చూపిస్తాయన్నారు. హెచ్‌ఎం పి.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కార్యక్రమం సఫలీకృతం కావడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు, అధికారులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, బాలబాలికలు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

అద్దంకి: చేతలు పరిశుభ్రతతో వివిధ రకాల వ్యాధులను దరికి రాకుండా చూసుకోవచ్చని ఎంపీడీవో దేవసేన అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చేతుల పరిశుభ్రత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివామూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులంతా తమతోపాటు, ఇంట్లోని వారి చేతా చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చేతులను మల,మూత్ర విసర్జనకు ముందు తరువాత శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులకు కారకమైన సూక్ష్మ క్రిములను దరిజేరకుండా చేయవచ్చని చెప్పారు.

కుందేరు.. మరో బుడమేరేనా!

- కుందేరుకు శాశ్వత పరిష్కారం చూపరా
- ఆక్రమణలకు అడ్డాగా మారిన వైనం
- మురికి కూపంగా మారుతున్న వైనం
- వ్యాధుల బారిన పడుతున్న జనం
- రంగుమారిపోతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



కుందేరు కాలువలో ఏపుగా పెరిగిపోయిన తూటుకాడ, జమ్ము



కుందేరు కాలువలో చెత్తా చెదారాలు

చీరాల రూరల్: దక్షిణ కోస్తాలో చీరాల తీరప్రాంతం చాలా ముఖ్యమైనది. చీరాలలో కుందేరు కాలువ ప్రవహిస్తోంది. వరదల సమయాల్లో వచ్చే వరదనీటిని ఒడిసిపట్టి సముద్రానికి ఇట్టే తరలించి ముంపు బారినుంచి ప్రజలను కాపాడుతుండేది. అయితే కుందేరు కాలువపై చిన్నచిన్న బ్రిడ్జిలు ఏర్పాటు చేయడంతో మురుగునీరు పారుదలలేక ప్రస్తుతం మురికికూపంగా మారిపోయింది. దానికితోడు కాలక్రమేణా కుందేరు కాలువ ఆక్రమణదారులతో కుంచించుకుపోయింది. దీనికి తోడు తుఫాన్‌ల ప్రభావాలు ఎక్కువవడంతో వరద వస్తే పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. లేకపోతే విజయవాడ నగరాన్ని ముంచెత్తిన బుడమేరు లాగా తయారయ్యే అవకాశం ఉంది. ఒకవైపు ఆక్రమణదారులకు కుందేరు అడ్డాగా మారిపోగా మరోవైపు మురుగునీరు పారుదల సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచి మురుగునీటి తటాకంగా మారిపోయింది. దీంతో ఆయా పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధంతో నిండిపోతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో దోమలకు, విష సర్పాలకు ఆవాసాలుగా మారిపోయాయి. తద్వారా ప్రజలు రోగాల బారినపడి ఆస్పత్రులలో చేరి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

ఎటు చూసినా వ్యర్థాలే..

కుందేరు కాలువ గతంలో బాపట్లలో మొదలై చిన గంజాం వరకు విస్తరించి ఉండేది. వరదల సమయాలలో పొలాల్లోని వరద నీరు, ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీటిని ఒడిసిపట్టి సముద్రానికి తరలించేది. అయితే కాల క్రమేణా చీరాల శివారు ప్రాంతమైన కుందేరు మీదుగా ఇతర గ్రామాలైన వాడరేవు, కొత్తపేట, రామాపురం, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు కుందేరు మీదుగా ప్రయాణం చేసి ఆయా గ్రామాలకు చేరుకుంటున్నారు. అయితే జన సాంద్రత పెరగడంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువైపోవడంతో దానికి తగ్గట్టే పాలకులు కుందేరు కాలువలపై బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. గతంలో ఒకటి రెండు బ్రిడ్జిలు ఉండగా ప్రస్తుతం అనేక చోట్ల తూములు ఏర్పాటు చేసి పాదాచారులు, వాహనదారులు వెళ్లేందుకు అనువుగా ఏర్పాటు చేశారు. అయితే పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో తూములు వద్ద చెత్తా చెదారాలు పేరుకుపోయి మురుగునీరు పారుదల సక్రమంగా జరగడంలేదు. దానికి తోడు మురుగునీటిని సముద్రానికి తరలించేందుకుగాను ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ, వేటపాలెంలోని రొంపేరు కాలువలు ఏర్పాటు చేయడంతో క్రమేణా కుందేరు కాలువకు ప్రాధాన్యం తగ్గిపోయింది. దీంతో కుందేరు కాలువ ప్రస్తుతం మురికి కూపంగా మారిపోయింది.

మురుగునీరు కూడా కాలువలోకే..

చీరాల పట్టణంలోని సగభాగం ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు నుంచి వచ్చే మురుగునీటిని చిన్నచిన్న కాలువల ద్వారా కుందేరు కాలువకు మళ్లించారు. అలానే చీరాల పరిసర గ్రామాలకు చెందిన పంచాయితీల్లోని ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు నుంచి వ్యర్థ పధార్థాలు, మురుగునీటిని కుందేరు కాలువలోకి వదులుతున్నారు. దీంతో కుందేరు కాలువ మురుగునీరు పారుదలలేక పోవడంతో దోమలకు ఆవాసాలుగా మారిపోయింది. దానికితోడు జమ్ము, తూటుకాడలు విపరీతంగా పెరిగిపోయాయి.

భూగర్భ జలాలు కలుషితం..

కుందేరు కాలువలో నీరు పారుదల లేకపోవడంతో మురుగునీరంతా భూమిలోకి ఇంకిపోయి నీరు పచ్చగా మారిపోయి వాడుకునేందుకు ఏ మాత్రం ఉపయోగపడడంలేదు. కుందేరు సమీప ప్రాంతాలలో నివాసముంటున్న ప్రజలు తమ బోర్లు నుంచి మురుగునీరు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. రంగుమారిన నీళ్లను ఉపయోగిస్తుండడంతో ప్రజలు చర్మ వ్యాధుల బారినపడుతున్నారు. శరీరమంతా దద్దుర్లు, దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కారం చూపని అధికారులు..

మురుగునీరు పారుదలలేక, దోమలకు ఆవాసాలుగా మారిన కుందేరు కాలువ ఆధునీకరణ పనులను అధికారులు ఏడాదికి ఒకసారి చేస్తుంటారు. ఆయా పనులు కూడా అధికారులు తూతూ మంత్రంగాచేసి చేతులు దులుపుకుంటున్నారే కానీ శాశ్వత పరిష్కారం మాత్రం చూపటంలేదని ప్రజలు బహిరంగంగా తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి తూముల వద్ద ఉన్న చెత్తా చెదారాలను జేసీబీల సాయంతో తొలగిస్తారు కానీ కుందేరు కాలువ లోపల పేరుకుపోయిన మురుగుకానీ, తూటు కాడలు, జమ్మును మాత్రం తొలగించడం లేదు. దీంతో కుందేరు కాలువ పరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన తయారయ్యిందని ప్రజలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

ఆక్రమణలతో కుంచించుకుపోతున్న కుందేరు కాలువ..

కుందేరు కాలువ మొదట్లో ఎంతో సువిశాలంగా ఉండేది. కాల క్రమేణా కాలువపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలువను రెండువైపులా కొందరు అక్రమార్కులు దర్జాగా ఆక్రమించుకున్నారు. అక్రమార్కులు ఒకడుగు ముందుకేసి రొయ్యల చెరువులు కూడా సాగుచేసుకుని సొమ్ముచేసుకుంటున్నారు. మరికొందరు పేదలు అనధికారికంగా చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇంకొందరు అక్రమార్కులు జోరుగా ఆక్రమణలు కొనసాగిస్తూ పక్కా ఇళ్లు నిర్మించి అద్దెలకు ఇచ్చుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

కరణం హయాంలో చిన్నపిల్లల పార్కు ఏర్పాటు...

కొత్తపేట వెళ్లే మార్గంలోని బ్రిడ్జి ప్రక్కగా గతంలో కొందరు కుందేరు స్థలాన్ని అధిక మొత్తంలో ఆక్రమించి సిమెంట్ బ్రిక్స్, ఇటుకలు, నాపరాళ్ల వ్యాపారం సాగించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆక్రమణలు తొలగింపజేసి ఆ స్థలంలో లక్షలు వెచ్చించి ఎంతో అందమైన ఆట వస్తువులతో చిన్న పిల్లల పార్కును ఏర్పాటుచేసి ఆ ప్రాంతాన్ని ఎంతో ఆహ్లాదకరంగా మార్చారు. ఆక్రమణలు తొలగించి పార్కు ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దోమలు పెరిగిపోతున్నాయి..



కుందేరు ఒడ్డున మేము అనేక సంవత్సరాలుగా నివాసముంటున్నాం. మాకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. కాలువ పక్కగా నివాసముండటంతో నిత్యం మురుగువాసనతో పాటు దోమలు విపరీతంగా ఉంటున్నాయి. ఈ మధ్య పాములు కూడా సంచరిస్తున్నాయి. ప్రతిరోజు ఎవరోఒకరు వ్యాధులబారిన పడుతున్నాం.

– షేక్ ఖాశిం, స్థానికుడు

నీళ్లు రంగు మారిపోతున్నాయి..



కుందేరులో మురుగునీరు నిలిచిపోవడం వలన బోర్ల నుంచి వచ్చే నీరు రంగుమారి పచ్చగా వస్తున్నాయి. వాడుకోవడానికి ఆ నీరు ఉపయోగపడటంలేదు. దీని వలన చర్మ వ్యాధుల సమస్యలు వస్తున్నాయి. ఒళ్లంతా దురద, దద్దుర్లు వస్తున్నాయి. ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవడం తప్ప ఉపయోగం ఉండటంలేదు.

– రసూల్, స్థానికుడు

అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు..



మేము నివసిస్తున్న ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కారం చేయాలని అధికారలకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగటానికి, ఓట్లు వేయటానికి మాత్రమే మమ్మల్ని ఉపయోగించుకుంటున్నారే కానీ మా సమస్యలు మాత్రం పట్టించుకోవడంలేదు. నడిచేందుకు రోడ్డు సౌకర్యం లేదు, మంచినీటి సౌకర్యం లేదు. వీధిలైట్లు ఉన్నా వెలగడం లేదు.

– ఉస్మాన్‌బీ, స్థానికురాలు

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



మార్టూరులో ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు



చీరాల ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ భాస్కరరావు



మేదరమెట్లలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

చీరాల టౌన్/వేటపాలెం: ఎరువులు అమ్మకాలు చేసే వ్యాపారులు విధిగా ఎమ్మార్పీకే అమ్మకాలు చేయాలని.. అధిక ధరలకు ఎరువులు విక్రయించిన, రైతులకు బిల్లులు ఇవ్వకపోయిన వారిపై చర్యలు తప్పవని చీరాల ఏడీఏ కట్టిబోయిన భాస్కరరావు హెచ్చరించారు. శనివారం చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లోని ఎరువుల దుకాణాలను ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల స్టాక్ వివరాలు, అమ్మకాలు చేసిన ఎరువులు, ఆఖరు తేదీ తదితర అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఎమ్మార్పీ కంటే అధికంగా ఎరువులు విక్రయించినా, కాలం చెల్లిన ఎరువులు అమ్మకాలు చేసిన డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

☛ ఎరువుల షాపు యజమానులు ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వేటపాలెం ఏవో ఐ కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. మండల పరిధిలోని నాలుగు ఎరువుల షాపులను ఏఓ పరిశీలించారు.



ముప్పవరంలో స్టాకును పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

లైసెన్స్‌లు కూడా రద్దు..

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: అధిక ధరలకు ఎరువులు అమ్మినట్లు రైతు ఫిర్యాదు చేస్తే 6–ఏ కేసు నమోదుతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏవో శ్రీనివాసరావు హెచ్చరించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గల రెండు ఎరువుల దుకాణాలను ఏవో శ్రీనివాసరావు తనిఖీ చేశారు.

☛ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఏడీఏ ధన్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దానిలో భాగంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణతో కలిసి ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డీఏపీ (50 కేజీలు) బస్తా రూ.1350, యూరియా రూ.267 చెప్పారు.

☛ జే.పంగులూరు మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని హనుమాన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. దుకాణంలోని పలు రికార్డులను పరిశీలించారు.

☛ మార్టూరు: ఎరువుల స్టాకుల వివరాలు, బిల్లు పుస్తకాలు, రసీదులు తప్పనిసరిగా దుకాణదారులు నిర్వహించాలని మార్టూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు.

గురజాడ తెలుగు వెలుగుల జాడ



సంతమాగులూరులో చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథపాలకుడు

మార్టూరు: మహాకవి గురజాడ అప్పారావు తెలుగు భాషకు దిక్సూచి అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం గురజాడ జయంతి వేడుకలను మండలంలోని ఇసుక దర్శి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం శైలజ లక్ష్మీ అధ్యక్షతన రోటరీ క్లబ్ ప్రతినిధులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సాంబశివరావు, షేక్ ఖాజా హుస్సేన్, కొత్రపాటి రాజారావు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని సంతమాగులూరులోని గ్రంథాలయంలో 'దైవమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా సమాజ సంస్కర్త బాల్యవివాహాలను రూపుమాపిన గురజాడ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు విజయభాస్కర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని



ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

వేటపాలెం: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్‌బాబు పిలుపు నిచ్చారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జాతీయ సేవా విభాగం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. కళాశాల ప్రాంగణంలోని 85 కేజీల వ్యర్థాలను వలంటీర్లు సేకరించి వాటిని రీసైకిలింగ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డీ జ్యోతి స్వరూప్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: ఊరును శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా వరద బాధితులకు సహాయక చర్యల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులను అభినందించే కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నిర్వహించారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వరద బాధితుల సహాయక కార్యక్రమాలలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, మున్సిపల్ అధికారులను, పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సత్కరించి వారు చేసిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



విరాళాలు సేకరించిన దాతలు

జే.పంగులూరు: ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు వరద ముప్పునకు గురై, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి తొచినంత సహాయం చేయాలని పంగులూరు గ్రామానికి చెందిన తాళ్లూరి రామాంజినేయులు వారి మిత్ర బృదంతో కలిసి గ్రామంలో విరాళాలు సేకరించారు. ఈ విరాళాలు మొత్తం రూ. 1.10 లక్షలను వరద బాధితుల సహాయార్థం డీడీ రూపంలో శనివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాచిన శ్రీనివాసరావు, హనుమంతురావు, పఠాన్ అబ్దుల్ రఫీ, సర్ధన సుబ్బారావు, మాధవి తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధికి రూ. 1.17 లక్షల అందజేత

చీరాల రూరల్: వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి మండల పరిధిలోని విజయనగర్‌కాలనీ వాసులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. గ్రామం నుంచి విరాళాల రూపంలో సేకరించిన రూ. 1,17,100 డీడీని శనివారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్యకు విజనగర్‌కాలనీ వాసులు, పెద్దలు కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో తేళ్ల వెంకటస్వామి, దుడ్డు సుందరరావు, తేళ్ల లక్ష్మీ ప్రసాద్, తేళ్ల దేవదానం, దుడ్డు ఏసుపాదం, బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, తేళ్ల పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ 1992 పూర్వ విద్యార్థులు సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు శనివారం తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



నరశింహారెడ్డి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

స్వర్ణపాలెం (కారంచేడు): మంచి విద్యాబుద్ధులు చెప్పడంతో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న స్వర్ణపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్ నరశింహారెడ్డి దంపతులను గ్రామస్తులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. శనివారం భోజన విరామ సమయంలో పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ ఘన సత్కారంలో ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, కొడవలివారిపాలెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఏ ఉమామహేశ్వరరావు, హెచ్‌ఎం పీ కోటేశ్వరరావు, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కలిగిస్తున్న సీఐ రమణయ్య

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాట పడకుండా వాటికి దూరంగా ఉండాలని ఇంకొల్లు సీఐ రమణయ్య అన్నారు. శనివారం ఇంకొల్లులోని దగ్గుబాటి చెంచురామయ్య మెమోరియల్ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో మమేకమై వారికి ర్యాగింగ్, ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి ఇతరత్రా చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. భవిష్యత్‌కు ఉపయోగపడే విషయాలను వారికి తెలియజేశారు. పోలీస్ శాఖ తరపున అవసరమై సాయాన్ని కోరవచ్చని తెలియజేశారు. కార్యక్రమలో పోలీస్ సిబ్బందితో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కారంచేడు: మత్తు పదార్థాలు, అక్రమ మద్యం రవాణాలు జరగకుండా ఉండేందుకు తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని ఎస్ఐ వీ వెంకట్రావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మండల కేంద్రమైన కారంచేడు కల్యాణ మండపం సమీపంలో వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో ద్విచక్రవాహనాలు, కార్లు, లారీలను సైతం తనిఖీలు చేశామన్నారు. ముఖ్యంగా వీకెండ్‌లో తెలంగాణా నుంచి ఆంధ్రాకు వచ్చే వాహనాల్లో మద్యం అక్రమ రవాణాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో తనిఖీలు మరింత ముమ్మరం చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సైతం ఆయన సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com